క్లుప్తంగా

ఉచిత చెవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లు విడుదల చేస్తున్న వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: చెవి, వినికిడి సమస్యతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకునే ఆర్థిక స్థోమత లేని పేదల కోసం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మార్చి 5న రోటరీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా చెవి ఆపరేషన్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సి.బి.మంజునాథరెడ్డి కోరారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో వైద్యశిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు ప్రదీప్, డిష్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు



ఖైదీలతో డాక్టర్ రమణనాయక్

శింగనమల: బుక్కరాయసముద్రం మండలంలోని ఓపెన్‌ఎయిర్ జైలులోని 31 మంది ఖైదీలకు జైలు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు శింగనమల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్. రమణనాయక్ తెలిపారు. ఖైదీలు అందరు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఓపెన్ ఎయిర్ జైలు సీఐ శివశంకర్, ఫార్మసిస్ట్ పవన్, ఏఎన్‌ఓ నాగేంద్ర పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో గురువారం ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడి రామేశ్వరయ్య అనే వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు..ప్యాపిలికి చెందిన రామేశ్వరయ్య పని మీద ఆటోలో గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి ఆటోలో ప్యాపిలికి బయలుదేరాడు. అయితే ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారి కింద పడి గాయపడ్డాడు. వెంటనే అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



మురుగు కాలువను శుభ్రం చేస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌తో పాటు ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది మురుగు కాలువలు శుభ్రం చేశారు. చెత్తా చెదారాన్ని తొలగించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రంజిత్, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్రితాత రథోత్సవం

పామిడి: వంకరాజుకాలువ గ్రామ మలుపులో పెన్నప్పగుడి వద్ద గల ఎర్రితాత పక్కీరప్ప స్వాముల ఆలయం వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎర్రితాత, పక్కీరప్పస్వాముల విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. పూజారి కిష్టప్ప ఆధ్వర్యంలో స్వామి విగ్రహాలకు గంగపూజ, గణపతి పూజ. రుద్రాభిషేకం, బిల్వార్చన వంటి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వాముల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి



సోదనపల్లిలో ఓటు వేయాలని అడుగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శింగనమల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. వారు గురువారం సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం, సలకంచెరువు, రాచేపల్లి, నాయనవారిపల్లి, ఆనందరావుపేట, నిదనవాడ, తరిమెలలోని సచివాలయలు, బ్యాంక్, ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఓటు వేయాలని కోరారు. నాయకులు వెన్నపూస రామిరెడ్డి, నారాయణస్వామి, ధనుంజయరెడ్డి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతుడు శ్రీకృష్ణదేవరాయలు





గుంతకల్లు: రాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బలిజసంఘం నాయకులు, గుత్తిలో కేక్ కట్ చేస్తున్న బలిజలు

గుంతకల్లు: తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి శ్రీకృష్ణదేవరాయలు అని వక్తలు పేర్కొన్నారు. గురువారం శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను పట్టణ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 60 అడుగుల రోడ్డులోని రాయల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కళా నైపుణ్యంతో గుడులు, గోపురాలను నిర్మించి తెలుగుదనాన్ని చాటిన గొప్ప మహనీయుడు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. తాగు, సాగునీరు కోసం వేల ఎకరాల్లో చెరువులు తవ్వించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పూలరమణ, గోవిందురాజులు, మణికంత, విశ్వనాథ్, రాయల్‌రంగ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: స్థానిక రాయల్ సర్కిల్లో గురువారం శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుత్తి, గుత్తి మండల బలిజ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మారాకుల రమణ, గౌరవాధ్యక్షులు పీవీ రమణ, మాజీ ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి రాము, కోశాధికారి బీఎస్ మంజునాథ్ రాయల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామిక వేత్త పీవీ రమణ శ్రీకృష్ణదేవరాయలు చరిత్రను, ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. నాయకులు పగడాల శ్రీనివాసులు,బాలరాజు రాయల్, రమేష్, పాటిల్ సురేష్, ఆముదాల గిరిధర్, రంగప్రసాద్ రాయల్, నిరంజన్, అరుణ్, విజయభాస్కర్, కోదండరాముడు, అంజి, బజాజ్ శ్రీకరం రవి, దేవేంద్ర రాయల్, చక్రి, చిరంజీవి, గురు, తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ట్రస్ట్ చైర్మన్ రామాంజి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: స్థానిక బస్టాండు సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద గురువారం బలిజ కులస్తులు శ్రీకృష్ణ దేవరాయల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం అధ్యక్షుడు హరిస్వామి శ్రీకృష్ణ దేవరాయలు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి, జగదీష్, గిరి, కంబగిరి రాయుడు, నారాయణ స్వామి, భీమారావు, చిన్న, కిశోర్ పాల్గొన్నారు.

కోమటికుంట్లలో ఇల్లు దగ్ధం

పుట్లూరు: కోమటికుంట్ల గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పెద్దయ్య అనే వ్యక్తికి చెందిన ఇంటి నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో పాటు మంటలను అదుపుచేయడానికి ప్రయత్నించారు. సంఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకోవడంతో మంటలు ఇతర ఇళ్లకు వ్యాప్తి చెందకుండా అదుపుచేశారు. కాగా ఈ ప్రమాదంతో రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

బుక్కరాయసముద్రం: నీలాంపల్లి గ్రామంలో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామంలో సిద్దయ్య అనే రైతు పొలంలో సపోట, మామిడి చెట్లు సాగు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో తోటలో ఉన్న చెట్లు డ్రిప్పు, స్ప్రింక్లర్లు పైపులు పూర్తిగా కాలిపోయాయి. దీంతో రూ.3 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ట్రాఫిక్‌తో ఉక్కిరిబిక్కిరి



గాంధీ సర్కిల్ వద్ద స్తంభించిన ట్రాఫిక్



ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- ప్రతి 10–15 నిమిషాలకోసారి ట్రాఫిక్ జామ్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- రోడ్డు దాటాలంటే జంకుతున్న వృద్ధులు, పిల్లలు

గుత్తి: ట్రాఫిక్ సమస్యతో పట్టణవాసులు ఉక్కిరిబిక్కిరివుతున్నాయి. ప్రతి 10–15 నిమిషాలకు ఒకసారి ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో రోడ్డు దాటాలంటే వృద్ధులు, పిల్లలు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ప్రధానంగా ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో రోడ్లు రద్దీగా మారుతున్నాయి. ట్రాఫిక్‌ను క్లియర్ చేయలేక పోలీసులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది. పట్టణం గుండా 63వ జాతీయ రహదారి పోతుండటం, రోడ్లు ఇరుకుగా ఉండటం, లారీలు, జీపులు, కార్లు, ఆటోలు మరీ ముఖ్యంగా ద్విచక్ర వాహనాల రాకపోకలు అధికం కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ట్రాఫిక్‌తో రోడ్డు ప్రమాదాలు..

గాంధీ సర్కిల్, రాయల్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, కొండారెడ్డి కాంప్లెక్స్ వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ట్రాఫిక్ ఎస్‌ఐ, సిబ్బంది లేకపోవడంతో సమస్య జటిలంగా మారుతోంది. రాత్రి వేళ ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. ట్రాఫిక్ సమస్య కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత శనివారం రోజే ట్రాఫిక్ సమస్యతో రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పట్టణంలోని రాయల్ సర్కిల్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న పుల్లారెడ్డి అనే వ్యక్తిని బైక్ ఢీ కొనింది. ఈ ప్రమాదంలో పుల్లారెడ్డి కాలు విరిగింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్న లక్ష్మీదేవి అనే మహిళను బైక్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు



ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. తోపుడు బండ్లు, గంపల వ్యాపారులు, ఆటోలు ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం. రద్దీగా ఉండే గాంధీ సర్కిల్, రాయల్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీసులను నియమించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.
– వెంకటరామిరెడ్డి, సీఐ

యువత లక్ష్యం వైపు అడుగులు వేయాలి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న హరికుమార్

గుంతకల్లు: యువత ఉన్నతమైన లక్షణాలను పెట్టుకొని ఆవైపు అడుగులు వేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శంకరనందగిరిస్వామి డిగ్రీ కళాశాల 39వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జీవిత భీమా సంస్థ అభివృద్ధి అధికారి డీ.తారాకేష్, కరస్పాండెంట్ కేసీ హరికుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇష్టపడి చదివితే ఉన్నతస్థాయిలో స్థిరపడువచ్చున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



నూర్ మహమ్మద్ (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం సమీపంలో బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న యువకుడు గుంతకల్లు పట్టణానికి చెందిన నూర్ మహమ్మద్ అని రైల్వే పోలీసులు గుర్తించారు. జీఆర్‌పీఎస్(గుంతకల్లు రైల్వే పోలీస్‌స్టేషన్) ఎస్‌ఐ వెంకటరమణ గురువారం వివరాలను విలేకరులకు వెల్లడించారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన నూర్ అహమ్మద్ బీఏ బీఈడీ చదివి స్థానిక పల్లవి పాఠశాలలో ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. చాలీ చాలనీ జీతంతో జీవితం ఎలా గడుస్తుందని మధనపడేవాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



ఉరి వేసుకొని మృతి చెందిన పెద్ద ఓబయ్య

యల్లనూరు: వాసాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మొగొల్ల పెద్ద ఓబయ్య(57) నాలుగెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తుండేవాడు. పిల్లల చదువుతోపాటు పంటల సాగుక కోసం సుమారు రూ.8 లక్షల వరకు అప్పుల చేశారు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మధనపడుతుండేవాడు. క్రమంలో గురువారం పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఓబయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, కమిషనర్, తహసీల్దార్

గుంతకల్లుటౌన్: వచ్చే నెల 13న జరుగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టణంలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను గురువారం డీఎస్పీ నర్సింగప్ప, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ బి.రాము పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలతో పాటు భద్రతా చర్యల నిమిత్తం చేయాల్సిన ఏర్పాట్ల గురించి చర్చించారు. కసాపురం ఎస్‌ఐ గోపాలుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

21న మండల మీట్

పామిడి: మండల పరిషత్ కార్యాలంయలో ఈనెల 21న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో ప్రజాప్రతినిధులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు.

గాయపడిన యువకుడి మృతి

గార్లదిన్నె: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు గురువారం మృతి చెందాడు. ఎస్‌ఐ సాగర్ వివరాల మేరకు.. శిరివరం గ్రామానికి చెందిన మధు(23) ఫ్లిప్ కార్టులో పని చేసేవాడు. ఈనెల 14న విధులు ముగించుకుని బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన మధును అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఉసేనప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భాగవతం పఠించండి



మాట్లాడుతున్న నార్పల సత్యనారాయణరెడ్డి

నార్పల: ప్రజా శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ భాగవత పారాయణం పఠించాలని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని అయప్పస్వామి ఆలయంలో పెద్దలు మహా భాగవత సప్తాహ శ్రవణ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 పురాణాల్లో భాగవతం పవిత్రమైనదన్నారు. అయప్పస్వామి దేవాలయ అర్చకులు బ్రహ్మేంద్రస్వామి, తీగల నారాయణరెడ్డి, బయన్న, నారాయణప్ప, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

యల్లనూరు: ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తాడిపత్రి డీఎస్పీ వీఎన్‌కే చైతన్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో నాయకులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా వేసి ఉంచాలన్నారు. గ్రామాల్లో ఏదైనా చిన్న సమస్య తలెత్తినా పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కల్లూరులో షటిల్ టోర్నీ

గార్లదిన్నె: కల్లూరులో మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం షటిల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పెద్దపోతుల పవన్ తెలిపారు. ప్రభుత్వ విద్యుసలహాదారులు ఆలూరి సాంబశివారెడ్డి టోర్నీ ప్రారంభిస్తారన్నారు . విజేతలకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు అందిస్తామన్నారు. వివరాలకు 99894 54719,9032321292,9398164633 నంబర్లను సంప్రదించాలన్నారు.పోటీలు తిలకించడానికి వచ్చే ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు



వివరాలు తెలుసుకుంటున్న వడిత్యా శంకర్ నాయక్

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న గిరిజన విద్యార్థుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఎస్టీ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో విద్యార్థులు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఉద్యోగుల, స్టాక్ రికార్డులు, మరుగుదొడ్లు, వంట గది, స్టోర్ రూంను పరిశీలించారు. చదువులో పిల్లల సామర్థ్యాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డించలేదని మండిపడ్డారు. టెన్త్ విద్యార్థులు కనీసం తెలుగు పుస్తకం చదవడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్మోహన్‌రెడ్డి విద్య, వైద్యంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. మండల అధికారులు తరచూ వసతి గృహాలను తనిఖీలు చేయాలని సూచించారు. తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ తేజోత్స్న, ఎంఈఓ గురుప్రసాద్, ఎస్‌ఐ శివప్రసాద్, జీఏఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, జిల్లా అధ్యక్షుడు సాకే ఆనంద్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు పక్కాగా చేయించండి



దుగుమర్రిలో పంట నమోదును పరిశీలిస్తున్న అధికారులు

నార్పల: పంట వేసిన ప్రతి రైతు పంట నమోదు పక్కాగా చేయించాలని వ్యవసాయ కమిషనరేట్ ఏడీ మద్దిలేటి పేర్కొన్నారు. గురువారం ఆయన దుగుమర్రి గ్రామంలో వ్యవసాయ అధికారులు నిర్వహించిన పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పంట నమోదు చేయించుకుంటేనే పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్ తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. ప్రతి రైతు రైతు భరోసా కేంద్రంలో ఉన్న వ్యవసాయ అధికారుల చేత పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పంట నమోదులో అవకతవకలు జరగకుండా పక్కాగా నిర్వహించాలని వ్యవసాయాధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, ఏఓ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

పామిడి: వంకరాజుకాలువ గ్రామ పెన్నప్పగుడి వద్ద వెలసిన ఎర్రితాత, పక్కీరప్ప స్వాముల రథోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నుంచి రెండురోజుల పాటు రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. న్యూకేటగిరి విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు. రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.7వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4 వేలు చొప్పున నగదు బహుమతి ఉంటుందన్నారు. శనివారం నిర్వహించే ఆరుపళ్ల విభాగం పోటీల్లో విజేతలకు వరుసగా రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.9వేలు, రూ.8వేలు, రూ.7వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుతులు ఉంటాయన్నారు. పోటీలను పురస్కరించుకుని అన్నదానంనిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



సీఐకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

గుంతకల్లు: జీపీ.హేమకోటిరెడ్డి అంత్యక్రియలు న్యూస్ కవర్ చేయాడానికి వెళ్లిన పాత్రికేయులపై అసభ్యపదజాలంతో దూషించిన జీపీ.మంతకల్లురెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పట్టణ పాత్రికేయుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టూటౌన్ సీఐ గణేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న కోటిరెడ్డితోపాటు ఆయన డ్రైవర్ షేక్షావలి దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన కుటుంబసభ్యులు ఆంత్యక్రియల్లో పాల్గొనడానికి అమెరికా నుంచి గుంతకల్లుకు వచ్చారు. దీంతో పాత్రికేయులు న్యూస్ కవర్ చేయాడానికి బస్టాండ్ సమీపంలోని ఆయన ఇంటి వద్దకు వెళ్లారు. అ సమయంలో ఫొటోలు తీసేందుకు ప్రయత్నించిన విలేకరులపై కోటిరెడ్డి సోదరుడు కూమారుడు మంతకల్లు రెడ్డి దుర్భాషలాడాడు.

నిరుపయోగంగా స్వీపింగ్ వాహనాలు



తిమ్మనచెర్ల వాటర్ ట్యాంక్ ఆవరణలో మూలనపడేసిన రోడ్డు స్వీపింగ్ వెహికల్

గుంతకల్లుటౌన్: స్వచ్ఛభారత్–క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) కార్యక్రమాల అసలు లక్ష్యాలు మున్సిపల్ శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రోడ్లను శుభ్రం చేయడానికి స్వచ్ఛభారత్ కింద గుంతకల్లు మున్సిపాల్టీకి కేటాయించిన లక్షలాది రూపాయలు విలువ చేసే 2 రోడ్డు స్వీపింగ్ వాహనాలను అధికారులు మూలనపడేశారు. స్వీపింగ్ వెహికల్స్ వచ్చిన కొత్తలో మూడు నెలలేమో పట్టణంలోని మెయిన్‌రోడ్డును శుభ్రం చేయడానికి వినియోగించారు. డ్రైవర్ల కొరత, రిపేర్లు, అరిగిపోయిన బ్రష్‌లు మార్చలేక, వాటి నిర్వహణ సక్రమంగా చేయని కారణంగానే ఆ వాహనాలు నిరూపయోగంగా మారాయి. వాహనాలకు సంబంధించిన పలు స్పేర్ పార్ట్‌లు తుప్పు పట్టి సేవచేయకనే శిథిలమవుతున్నాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ఇప్పటికై నా అధికారులు రోడ్డు స్వీపింగ్ వాహానాలను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రభుత్వ లక్ష్య సాధనకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఏకాదశి వేడుకలు



అలంకరణలో లక్ష్మీ చెన్నకేశవస్వామి

పామిడి: పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో గురువారం విజయ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీ చెన్నకేశవ ఆలయం, అనంత గజగరుడ లక్ష్మీ నారాయణస్వామి ఆలయం, భోగేశ్వర స్వామి ఆలయం, పాండురంగ స్వామి ఆలయాల్లో వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అభిషేక పూజలు, విష్ణు సహస్రనామ పారాయణం పఠించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు. దీంతో ఆలయ ప్రాంగణాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. భోగేశ్వరాలయంలో మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం చేశారు. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘం నేతలు పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘం నేతలు ప్రభాకర్, సిరాజుద్దీన్, సర్దార్‌వలి, విశ్వనాథ్, వన్నప్ప, చితంబరరెడ్డి, నాగరాజు, హరిహరనాథ్ అంజలీ దేవి, నీరజ, విజయలక్ష్మి, నాగేంద్ర, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.